క్లుప్తంగా

ఎమ్మెల్యే చినరాజప్పను కలసిన ఆర్డీఓ



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్డీఓ కిశోర్

సామర్లకోట: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను కాకినాడ ఆర్డీఓ కిశోర్ గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తరువాత అచ్చంపేటలో ఆయన స్వగృహంలో చినరాజప్పను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నీటి వనరులను సంరక్షించుకోవాలి



ఉండూరులో జల వనరులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

సామర్లకోట: నీటి వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని ఉండూరు పంచాయతీ కార్యదర్శి తోట సత్యం అన్నారు. నీటి వనరుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఉండూరు జిల్లా పరిషత్తు హైస్కూల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హైస్కూల్ నుంచి గ్రామ పురవీధుల మీదుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు జల వనరులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీరు లేకపోతే జీవరాశుల భవిష్యత్తు ఉండదని, నీటిని పొదుపుగా వాడాలని నినాదాలు చేశారు. నీటి పొదుపు, లీకేజీలను అరికట్టడం ద్వారా ఉపయోగాలను పాఠశాల హెచ్‌ఎం ఎం.కూర్మారావు వివరించారు. ఉప సర్పంచ్ కొప్పిరెడ్డి రాధాకృష్ణ, సత్యాడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

27న కంటి వైద్య శిబిరం

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలో శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ సంస్థ పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామానికి చెందిన వారే కాకుండా సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. సమావేశంలో సేవా సంస్థ ప్రతినిధులు వింజమూరి విశ్వనాథం, నువ్వుల వెంకట్రాజు, కేవీవీ సత్యనారాయణ, సూర్యచంద్రరావు, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 'నేను బడికి పోతా'



చంద్రంపాలెంలో పాఠశాలలో చేరడానికి అనుమతి పత్రం అందజేస్తున్న ఎంఈఓ

సామర్లకోట: విద్యా శాఖ ఆధ్వర్యంలో మండలంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. బడి బయట పిల్లలు పాఠశాలలో చేరే విధంగా చైతన్యం తీసుకువస్తున్నారు. చంద్రంపాలెం గ్రామంలో మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆరేళ్లు పూర్తయిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు వారికి ఆయా పాఠశాలల్లో ప్రవేశ పత్రాలను అందజేశారు. పాఠశాలల్లో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో బడిబయట ఉన్న 26 మంది పిల్లలను గుర్తించి, ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా అవగాహన కల్పించారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సమాజంలో ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని మత్స్యకార మహిళా నేత మడదా రాజేశ్వరి సూచించారు. మండలంలోని అమీనాబాదు క్రీస్తు నగరానికి చెందిన మత్స్యకార మహిళ బొందు కొండమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆమె కుటుంబాన్ని గురువారం రాజేశ్వరి పరామర్శించారు. బాధితుకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు.

అందని కిట్లు.. తప్పని పాట్లు

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందని స్టూడెంట్ కిట్లు
- యూనిఫాం కోసం ఎదురుచూపులు
- కేవలం నోట్, పాఠ్య పుస్తకాలు మాత్రమే పంపిణీ



స్టాక్ పాయింట్ వద్ద మూటల్లో ఉన్న స్కూల్ బ్యాగులు, ఇతర సామగ్రి



చేబ్రోలు హైస్కూల్‌లో స్టాక్ పాయింట్ నుంచి స్కూళ్లకు సరఫరా చేస్తున్న పాఠ్య పుస్తకాలు

గొల్లప్రోలు: గత ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మనబడి నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులు, బూట్లు, సాక్సులు, బెల్టు, పుస్తకాలను ఉచితంగా అందించింది. కాగా ఈ ఏడాది మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు ఇంకా పూర్తిస్థాయిలో అందలేదు. యూనిఫాం రాకపోవడంతో బ్యాగులు, బూట్లు, సాక్సులు, బెల్టు వంటి వస్తువులతో కూడిన స్టూడెంట్ కిట్లను పంపిణీ చేయలేదు. విద్యార్థులకు కేవలం పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ మాత్రమే అందజేశారు. వాటిలో 7వ తరగతి విద్యార్థులకు ఒక సబ్జెక్ట్ పాఠ్యపుస్తకాలు రాలేదు. గతేడాది వరకూ పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు కిట్లు అందించేవారు. ఈ ఏడాది పాఠశాలలు తెరిచి ఇప్పటికే వారం గడుస్తున్నా ఇంకా పూర్తిస్థాయిలో స్టూడెంట్ కిట్లు అందకపోవడం విమర్శలకు తావిస్తుంది.

మండలంలో 41 ప్రభుత్వ పాఠశాలలు

మండలంలో ప్రాథమిక పాఠశాలలు 32, తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వెరసి మొత్తం 41 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5,800 మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. వీరికి ప్రభుత్వ ఏటా స్టూడెంట్ కిట్లను ఉచితంగా అందజేస్తుంది. దీనిలో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలతో పాటు స్కూల్ బ్యాగ్, బెల్టు, షూ, సాక్సులు, యూనిఫాం అందిస్తున్నారు. గతేడాది వరకూ స్కూల్ ప్రారంభం రోజునే విద్యాకానుక కిట్లును అందజేసేవారు, ఈ ఏడాది మాత్రం విద్యార్థులకు ఇంకా పూర్తిస్థాయిలో కిట్లు అందలేదు.

పుస్తకాల పంపిణీ

ఏడో తరగతి పాఠ్య పుస్తకాలు మినహా ఒకటి నుంచి 10వ తరగతి వరకూ నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు పూర్తిగా వచ్చాయి. వీటిని స్కూల్ విద్యార్థులకు తరగతులు వారీగా పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఏడో తరగతి పాఠ్యపుస్తకాలు స్టాక్ పాయింట్‌కు రాగానే పాఠశాలల వారీగా విద్యార్థులకు అందజేస్తామని చెప్పారు.

స్టాక్ పాయింట్‌లోనే సామగ్రి

విద్యార్థులకు యూనిఫాంతో పాటు బ్యాగ్, బెల్ట్, బూట్లు, సాక్సులు అందిచాల్సి ఉంది. వీటిలో యూనిఫాం రాకపోవడంతో అవి వచ్చే వరకూ చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్‌కు చేరిన మిగిలిన వస్తువులు నిరీక్షించే పరిస్థితి నెలకొంది. త్వరలో యూనిఫాం వస్తుందని అధికారులు తెలిపారు. యూనిఫాం వచ్చిన వెంటనే మిగిలిన కిట్లను విద్యార్థులకు అందజేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రేపటి నుంచి పంపిణీ చేస్తాం



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశాం. ఏడో తరగతి మినహా అన్నితరగతుల విద్యార్థులకు పుస్తకాలు అందాయి. ఇప్పటికే స్కూల్ బాగ్‌లు, బూట్లు, బెల్టు, సాక్సులు, స్టాక్‌పాయింట్‌కు చేరాయి. వీటిని రేపటి నుంచి మండలంలోని పాఠశాలల వారీగా విద్యార్థులకు అందజేస్తాం.యూనిఫాం రాగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ చేస్తాం.

– టీవీఎస్ దుర్గాప్రసాద్, ఎంఈఓ, గొల్లప్రోలు

స్వచ్ఛమైన నీరు అందించాలి



ఫిల్టర్ బెడ్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

సామర్లకోట: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఫిల్టర్ బెడ్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. ఈ ఫిల్టర్ చెరువులో చేపల వేట కారణంగా నీరు కలుషితం కావడంతో గోదావరి జలాలు నేరుగా ఫిల్టర్ బెడ్‌లోకి తీసుకుని శుద్ధి చేసి అందజేయాలని సిబ్బందికి సూచించారు. సోమవారం వరకూ తాను అత్యవసర పనిపై సెలవు పెడుతున్న కారణంగా ఇంజినీరింగ్ సిబ్బంది తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గోదావరి జలాల నీటిమట్టం తగ్గిపోతే బోర్ల నుంచి ప్రజలకు నీరు అందజేయాలని సూచించారు.

నేడు ఉయ్యాల తాళ్ల ఉత్సవం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఉయ్యాల తాళ్ల ఉత్సవం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రామ్మోహనరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జాతర మహోత్సవాల్లో భాగంగా ఉయ్యాల తాళ్ల ఉత్సవం నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి పాత పెద్దాపురం వారిచే ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



రాక్ సిరామిక్స్ గేటు వద్ద బైఠాయించిన కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ పరిశ్రమలో కార్మికులను తొలగించడంతో ఆందోళన కొనసాగుతోంది. గురువారం ఫ్యాక్టరీ గేటు ఎదురుగా రోడ్డుపై కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ ఆందోళనకు సీఐటీయూ మద్దతు తెలిపింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ మాట్లాడుతూ రాక్ సిరామిక్స్‌లో పని చేస్తున్న కార్మికులను తొలగించి 65 రోజులు గడిచిందన్నారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించకపోతే వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల మద్దతు తీసుకుని పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. స్థానికులకు అవకాశం ఇవ్వాల్సి ఉండగా, ఇతర ప్రాంతాల నుంచి కార్మికులను తీసుకువచ్చి పనిలో పెట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, రాజబాబు, సతీష్‌కుమార్, గంగాధర్, శివనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాదాలమ్మతల్లి జాతర



ప్రత్యేక అలంకరణలో మాదాలమ్మతల్లి



అమ్మవారి జాతరలో గరగల ఊరేగింపు

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో మాదాలమ్మతల్లి జాతర గురువారం రాత్రి వైభవంగా జరిగింది. గరగ నృత్యాల నడుమ గ్రామంలో చిరుతాడిని ఊరేగించారు. జాతర సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనాలు కల్పించారు. పౌర్ణమి సందర్భంగా శుక్రవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు తెలిపారు. తీర్థానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

టెక్నికల్ అసిస్టెంట్లకు పని కల్పించాలి

బోట్‌క్లబ్ (కాకినాడ): రైతు భరోసా కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్లకు ఏడాదిలో 11 నెలలు పని కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ నివాస్‌కు వినతి పత్రం ఇచ్చారు. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లకు కేవలం సంవత్సరంలో రెండు మూడు నెలలు మాత్రమే పని కల్పించిందన్నారు. దీంతో వారు సంవత్సరంలో 9 నుంచి 10 నెలలు పనిలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ తప్పును సరిదిద్ది సంవత్సరంలో 11 నెలలు పని కల్పించాలన్నారు.

తురాయి... మది మురిసెనోయి



నాగులపల్లి–మూలపేట రోడ్డులో కనువిందు చేస్తున్న తురాయి పూలు

కొత్తపల్లి: నియోజకవర్గంలోని రోడ్లకు ఇరువైపులా ఉన్న పలు రకాల చెట్లు ప్రస్తుతం పూలకాంతులతో వెల్లివిరుస్తున్నాయి. మండలంలో నాగులపల్లి–మూలపేట, ఉప్పాడ–పిఠాపురం, కొత్త ఇసుకపల్లి–పాత ఇసుకపల్లి రోడ్లలో ప్రకృతి కొత్త శోభను సంతరించుకుని కనువిందు చేస్తోంది. ఈ రోడ్లకు ఇరువైపులా తురాయి చెట్లు విరబూయడంతో రోడ్లు ఎరుపెక్కాయి. ఎర్రని తురాయి పూలు విరబూసి ప్రజలు, వాహన చోదకులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఈ రహదారుల్లో వెళ్లే ప్రయాణికులు చెట్ల కింద ఆగి సెల్ఫీలు తీసుకుంటున్నారు. ప్రకృతి ఒడిలో సేద తీరుతున్నారు.



కొత్తపల్లి–శొంఠివారిపాకలు రోడ్డులో విరబూసి ఆహ్లాదాన్ని పంచుతున్న తురాయి చెట్లు

వేగవంతంగా రెవెన్యూ సేవలు

- కాకినాడ ఆర్డీఓ కిశోర్
- రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు



గొంచాలలో భూమి సమస్యపై ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న రైతు

సామర్లకోట: రెవెన్యూ సేవలు ఇక నుంచి మరింత వేగవంతంగా జరుగుతాయని కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిశోర్ అన్నారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా గొంచాల పంచాయతీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఏ శాఖకు లేని విధంగా రెవెన్యూకు ఒక రోజు కేటాయించారన్నారు. రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి సర్వే నంబరులో ఉన్న భూమిని మొదట గుర్తించి ఆ భూమిలో ఎంత మంది రైతులు ఉన్నారు.. ఎవరికి ఎంత భూమి ఉందనే విషయాన్ని సర్వేయర్లు, వీఆర్వోలు గుర్తించాలన్నారు. మధ్యలో కొంత మంది రైతులు భూములను కొనుగోలు చేసుకుని కొలతలు మార్పులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇటువంటి తరుణంలో పూర్వ దస్తావేజు కలిగిన వారి దస్తావేజు ప్రకారం న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రభుత్వ భూమిని అనేక మంది ఆక్రమించుకుంటున్నారని, అటువంటి చర్యలు రెవెన్యూ సహించదన్నారు. సహజంగా ఉన్న భూమి కంటే రైతుల రికార్డు ప్రకారం భూమి ఎక్కువ ఉంటే మిగిలిన భూమి ఎక్కడ నుంచి వస్తుందని ఆర్డీఓ ప్రశ్నించారు. బ్రిటిష్ వారి కాలంలో కొలతలకు సంబంధించిన పరికరాలు లేకపోవడంతో భూమిలో కొంత మేరకు వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉందన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం రెవెన్యూ శాఖలో మార్పులు తీసుకు రావడంతో పాటు పాస్ పుస్తకాలలో మార్పులు తీసుకు వస్తుందన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన ఎటువంటి సమస్యనైనా తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలన్నారు.

రైతుల ఇబ్బందులను పట్టించుకోక..

రైతుల ఇబ్బందులను సర్వేయర్లు, వీఆర్వోలు పట్టించుకోవడం లేదని గొంచాల గ్రామానికి చెందిన ముమ్మిడి వెంకట్రావు, పెన్నింటి శ్రీరామచంద్రమూర్తిలు ఆవేదన వ్యక్తం చేశారు. 216 జాతీయ రహదారికి తన భూమి తీసుకున్నారని, మిగిలిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎన్ని పర్యాయాలు తిరిగినా సమస్య పరిష్కారం కాలేదని రైతు వెంకట్రావు అన్నారు. ఇళ్ల పట్టాలకు సంబంధించి భూమి ఒకరు ఇస్తే మరొకరి ఖాతాలో నగదు జమ అయ్యిందని శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఈ సమస్యలను పరిష్కరిస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారు. తహసీల్దార్ వై.శ్రీనివాసు, సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

జి.రాగంపేట గ్రామంలో..

పెద్దాపురం: రెవెన్యూ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శకంగా సేవలు అందుతున్నాయని పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి జె.సీతారామారావు అన్నారు. జి.రాగంపేటలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ పద్మజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీతారామారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవస్థకు మూల స్తంభం రెవెన్యూ శాఖ అన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నిస్వార్థ సేవలందించేది రెవెన్యూ సిబ్బంది అన్నారు. అనంతరం విశ్రాంత వీఆర్వోలను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ శేఖర్, ఎంపీటీసీ సభ్యులు కాలే అనురాధ, జల్దాని బాబి, బోస్ తదితరులు పాల్గొన్నారు.



జి.రాగంపేటలో విశ్రాంత వీఆర్వోలను సత్కరిస్తున్న ఆర్డీఓ తదితరులు

డయేరియా నివారణకు చర్యలు



దుర్గాడలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీఎల్‌పీఓ అన్నామణి

గొల్లప్రోలు: దుర్గాడలో గురువారం జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి అన్నామణి పర్యటించారు. ఇటీవల దుర్గాడలో ఓ చిన్నారి డయేరియా బారిన పడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఈ నేపథ్యంలో డీపీఎల్ఓ అన్నామణి గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో డయేరియా వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకున్నామన్నారు. డ్రైన్లు, రోడ్లు, వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచాలని సూచించారు. ఇళ్ల మధ్య నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

కాకినాడ రూరల్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఈ నెల 29న జరుగుతుందని న్యాయవాది యనమల రామం అన్నారు. దీనిపై గురువారం స్థానిక సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసుల గురించి అవగాహన కల్పించారు. రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి ఇరువర్గాల కక్షిదారులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



పెద్దాపురం శ్రీప్రకాష్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా దోహదపడుతుందని పెద్దాపురం శ్రీప్రకాష్ పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, ఈషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, అటువంటి ఒత్తిడిని దూరం చేసేందుకు యోగా దోహదపడుతుందన్నారు. యోగా చేసే విధానంలో ఎన్ని మార్పులున్నా అన్నింటికి మూలం పతంజలి మహర్షి అందించిన యోగా సూత్రాలేనని, ఈషా ఫౌండేషన్ స్థాపించి జగ్గీ వాసుదేవ్ యోగాసనాలకు అత్యంత ప్రాచుర్యం కల్పించారన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యెగాసనాలు వేసిన విద్యార్థులకు తరగతుల వారీగా అర్హత పత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ, చిన్ని, ప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



యోగా ఆకారంలో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు

యోగాతో అనేక ప్రయోజనాలు

సామర్లకోట: యోగాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని పాఠశాల హెచ్‌ఎం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు యోగా ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. జాతీయ స్థాయిలో యోగా ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థి బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లోనే ఉండటం విశేషమన్నారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తాళ్లూరి వైకుంఠం పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

సామర్లకోట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ ఉష అన్నారు. స్థానిక బ్రౌన్‌పేట సెక్టార్ పరిధి పెన్షన్‌లైన్‌లో గుడారాలు వేసుకుని జీవిస్తున్న సంచార జాతులకు ఆమె గురువారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల కారణంగా అనేక రకాల వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. దీనిపై అంగన్‌వాడీ కార్యకర్తలు తరచూ పర్యవేక్షణ చేస్తూ ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషక విలువతో కూడిన ఆహారం అందిస్తున్నారన్నారు.



సంచార జాతుల వారికి అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ ఉష తదితరులు